



జడ్పీటీసీలు, ఎంపీపీలతో మంత్రి పొన్నం ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

వాడీవేడిగా జడ్పీ సమావేశం



పరస్పరం హెచ్చరించుకుంటున్న కౌశిక్‌రెడ్డి, గీకురు రవీందర్

- డీఈవోను సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పట్టు
- సమావేశంలో మాట్లాడకుండానే బయటకు వెళ్లిన కలెక్టర్
- ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్
- డీఈవోను సస్పెండ్ చేయాలని ఏకగ్రీవ తీర్మానం

కరీంనగర్ టౌన్, జూలై 2: జిల్లా ప్రజాపరిషత్ చివరి సర్వసభ్య సమావేశం రాజకీయంతో వేడెక్కింది. జడ్పీ సమావేశమందిరంలో చైర్ పర్సన్ కనుమల్ల విజయ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. జూన్ 5తో జడ్పీ పాలకవర్గ పదవీకాలం ముగియ నుండడంతో చివరి సమావేశంలో విద్య, వైద్యం, వ్యవసాయం మూడు అంశాలపైనే చర్చించుకొని ఆ తర్వాత వీడ్కోలు కార్యక్రమాన్ని సంతోషంగా జరుపుకుందామని జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ ప్రకటించారు.

• డీఈవో విధానాలపై అసంతృప్తి

విద్య, వైద్యంపై చర్చ పూర్తికాక ముందే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేగా తన నియోజకవర్గంలో విద్యపై ఎంఈవోలు, ప్రధానోపాధ్యా యులతో సమావేశం నిర్వహించి విద్యారంగ సమస్యలపై చర్చించేందుకు సమావేశం నిర్వహించే అధి కారం ఉందా లేదా అనే అంశాన్ని స్పష్టం చేయాలని కలెక్టర్‌ను కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థుల సమస్య లపై మంత్రి సమీక్ష నిర్వహించక పోవడంతో తాను తన నియోజక వర్గంలో సమీక్ష నిర్వహించానన్నారు. డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు ఎమ్మెల్యే సమావేశానికి ఎందుకు హాజరయ్యా రంటూ ఎంఈవో లకు, హెచ్‌ఎంలకు నోటీసు ఇచ్చారన్నారు. ఇది పూర్తిగా అనైతిక మని, ఎమ్మెల్యే హక్కులను భంగపరచడమేనని తెలి పారు. డీఈవోను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో డీఈవో మాట్లాడేందుకు ప్రయత్నించగా కౌశిక్‌రెడ్డి ఆయనను సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను కోరడంతో డీఈవో మాట్లాకుండా వెళ్లిపోయారు. డీఈవోను సస్పెండ్ చేయాలంటూ జడ్పీటీసీ, ఎంపీపీలతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

• దళిత బంధు విడుదల చేయాలని టీషర్ట్ ధరించి వచ్చిన జమ్మికుంట జడ్పీటీసీ

బీజేపీకి చెందిన జమ్మికుంట జడ్పీటీసీ శ్రీరాంశ్యామ్ దళితబంధు రెండో విడుత నిధులు మంజూరు చేయాలనే నినాదంతో ఉన్న టీషర్టు వేసుకొని జడ్పీకి వచ్చారు. ఆయనను పోలీసులు ప్రధాన ద్వారం వద్ద అడ్డుకొని లోనికి అనుమతించలేదు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వెంటనే జడ్పీటీసీ సభ్యుడిని లోనికి అనుమతించాలని,పోలీ సులు ఆయనను ఎందుకు అడ్డు కున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. దళి తుల అభ్యున్నతి కోసం కేసీఆర్ దళితబంధు పథకాన్ని అమలు చేసి హుజూరాబాద్ నియోజక వర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, రెండో విడత 3,500 నుంచి నాలుగు వేల మందికి డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయి ఉన్నప్పటికీ ఎందుకు వాటిని ఫ్రీజ్ చేశారో చెప్పాలని కలెక్టర్‌ను కోరారు.



జమ్మికుంట జడ్పీటీసీ శ్రీరాం శ్యాం

దళితబంధుపై ప్రభుత్వ నిర్ణయమేమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

- కలెక్టర్ పమేలా సత్పతి మాటాడుతూ దళితబంధు పథకంలో ఏయే ప్రాజెక్టులను ఎంపిక చేసి ఎన్ని నిధులు కేటాయించారు.. ఇంకా ఎన్ని నిధులు ఇవ్వాలి, ప్రాజెక్టుల పరిస్థితిపై నివేదిక ఇచ్చే వరకు రెండో విడత డబ్బులను రిలీజ్ చేయవద్దని ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఆదేశించిందన్నారు. దీనికి సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపించామని వివరించారు. దళిత బంధుపై ప్రభుత్వ నిర్ణయమేమిటో కలెక్టర్ స్పష్టం చేసినందున రాష్ట్రంలోని దళితులు ఆలోచన చేయాలని కౌశిక్‌రెడ్డి కోరారు. దళితబంధు కోసం ఎలా పోరాడాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు.

'స్థానిక సంస్థల'ను బలోపేతం చేయండి...

- జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ



15వ ఆర్థిక సంఘం నిధులు మినహా జడ్పీకి ఎలాంటి నిధులు రాలేదని, సంస్థ లను బలోపేతం చేయడంతోపాటు పంచాయతీరాజ్ చట్టాన్ని మంత్రిగా కాపాడాలని జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ పొన్నం ప్రభాకర్‌ను కోరారు. తనకు పదవి రావడం ఇల్లందకుంట ప్రజ లు పెట్టిన భిక్షేనని, ఆనాటి మం త్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్ ఆశీస్సులు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్ల వల్లనే తనకు ఈ అవకాశం దక్కిందన్నారు. అంబేద్కర్ తనకు దేవుడితో సమానమని తెలిపారు. రెండోసారి జడ్పీటీసీగా గెలిచి జడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికవడంలో తన భర్త ప్రోత్సాహం ఎంతో ఉందని, అయినా ఆయన ఏనాడూ తనతో సమావేశానికి కాలేదని, ఎక్కడా ఫొటోల్లో కనిపించకుండా ప్రొటోకాల్‌కు విలువ ఇచ్చార న్నారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కలెక్టర్, ఇతర అధికారులతోపాటు ప్రతి ఒక్కరూ సహకరించారని తెలిపారు. కొవిడ్‌తో తన తమ్ముడు మృతి చెందాడని, పదవీ బాధ్యతలు స్వీకరించిన నాడున్న ఆయన వీడ్కోలు రోజు లేక పోవడం విచారకరమని కంటతడిపెట్టారు. చైర్ పర్సన్‌గా ఉన్నా మహమ్మారి నుంచి తాను తన తమ్ముడిని కాపాడు కోలేక పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎంత ఎదిగినా ఒదిగి ఉన్నానే తప్ప ఏనాడు ఎవరి పట్ల అమర్యాదగా ప్రవర్తించలేదని, ఎవరి మనసు బాధపెట్టే విధంగా వ్యవహరించ లేదని అన్నారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్లు అమలయ్యేటట్లు చూడాలని మంత్రిని కోరారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ దంప తులు విజయ గణపతిని మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎ మ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జడ్పీ వైస్ చైర్మన్ గోపాల్ రావు సన్మానించారు. 15 మంది జడ్పీటీసీలు, ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు, 15 మంది ఎంపీపీలను శాలువతో సన్మానించి మెమొంటోలను బహూకరించారు.

• గీకురు రవీందర్‌రెడ్డి వర్సెస్ కౌశిక్‌రెడ్డి

ఈ సందర్భంగా ఇటీవల కాంగ్రెస్ చిగురుమామిడి జడ్పీటీసీ గీకురు రవీందర్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరును ఖండిస్తూ మాట్లాడేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌కు అమ్ముడు పోయిన నీకు మాట్లాడే అర్హత లేదనడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు ఎమ్మెల్యేకు అండగా నిలిచి డీఈవోను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. మరోవైపు కాంగ్రెస్ జడ్పీటీసీ, ఎంపీపీలు గీకురు రవీందర్‌కు మద్దతుగా నిలిచి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సమావేశంలో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇరువర్గాలను జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ శాంతించాలని కోరినా ఫలితం లేక పోయింది.

● కలెక్టర్ వెళుతుండగా అడ్డుకుని బైఠాయింపు

కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సమావేశంనుంచి వెళ్లేందుకు వేదిక దిగారు. తమకు సమాధానం ఇవ్వకుండా ఎలా వెళ్తారంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, జడ్పీ టీసీలు, ఎంపీపీలతో ద్వారం వద్ద అడ్డంగా బైఠాయించి కలెక్టర్‌ను నిలదీశారు. పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుతొలగించడంతో కలెక్టర్ కొంత అసహనం వ్యక్తంచేస్తూ సమాధానమివ్వకుండానే వెళ్లిపోయారు. దీనితో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సమాధనమివ్వకుండా కలెక్టర్ వెళ్ళి పోయారని డీఈవోను సస్పెండ్ చేసే వరకు నిరసన వ్యక్తంచేస్తామంటూ పోడియం ఎదుట జడ్పీటీసీ, ఎంపీపీలతో కలిసి ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఆందోలనకు దిగారు. మరోవైపు జడ్పీటీసీ గీకురు రవీందర్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో మరోసారి ఉద్రిక్త పరిస్థి తులు తలెత్తాయి. ఈక్రమంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌తో జరిగిన సంభాషణలో నీ అంతు చూస్తామని, నీతో ఏమి కాదంటూ అనుచిత పదజాలంతో ఒకరిపై ఒకరు దూషణలతో హెచ్చరించుకున్నారు.



కలెక్టర్‌ను సమాధానం చెప్పాలని నిలదీస్తున్న కౌశిక్‌రెడ్డి

చైర్‌పర్సన్ పలు మార్లు వారించే ప్రయత్నం చేసిన వారిద్దరూ తగ్గలేదు. చివరకు మానకొండూర్ జడ్పీటీసీ శేఖర్ జోక్యం చేసుకొని సభాపతి ఎవరికి అవకాశమిస్తే వారు మాట్లాడాలని ఇరువర్గాలను శాంతింప జేశారు. డీఈవో జనార్దన్‌రావును సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మా నించాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన సూచన మేరకు కేశవపట్నం జడ్పీటీసీ ప్రతిపాదించగా, మానకొండూర్ జడ్పీటీసీ ఆమోదిం చడంతో కాం గ్రెస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు ఈ ప్రతిపాదనకు మద్దతు ఇచ్చారు. దీంతో డీఈవోను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించినట్లు జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ ప్రకటించి సమా వేశాన్ని ముగించారు. ఐదేళ్ల పదవీకాలంలో ఇలా పరస్పర దూషణలు చేసుకోకుండా చివరి సమావేశంలో ఇలా ఒకరినొకరు దూషించుకోవడంతో అధికారులు, ఉద్యో గులు, ఇతర ప్రజాప్రతినిధులు ఒకింత ఆశ్చర్యంతోపాటు అసంతృప్తిని వ్యక్తంచేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సీఈవో శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

'స్థానిక సంస్థల'కు అత్యంత ప్రాధాన్యం

- పార్టీలకతీతంగా సమస్యల పరిష్కారం
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



స్థానిక సంస్థలకు అత్యంత ప్రాధాన్య మిచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృ త్వంలోని తమ ప్రభుత్వం కృతనిశ్చ యంతో ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం జడ్పీ సమావేశమందిరంలో చైర్‌పర్సన్ కను మల్ల విజయ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాలకవర్గ వీడ్కోలు సన్మాన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లా డుతూ ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న జడ్పీటీసీలు, ఎంపీపీలు, జడ్పీ కో ఆప్షన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఐదేళ్ళ ప్రజా జీవితంలో నిధులు ఉన్నా.. లేకున్నా, కష్టాలు వచ్చినా, ప్రజా సమ స్యల కోసం కృషిచేశారన్నారు. ఎంపీపీలు, జడ్పీటీసీల పదవీ కాలం ముగిసినా ప్రజాజీవితంలో మీరు మళ్లీ ఏదో పదవికి ఎన్నికై ప్రజలకు సేవలందిస్తారని ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ నిధులు ఉన్నా లేకున్నా ఎన్ని కష్టాలు వచ్చినా అందరిని కలుపుకొని ఐదేళ్ళ పదవీకాలం పూర్తిచేసి మంచి పేరు తెచ్చుకున్నారని మంత్రి పొన్నం అభినందించారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి
- కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యు కార్యకర్తలు

సుభాష్‌నగర్, జూలై 2: ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీ యింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 25 శాతం ఉచిత విద్యను పేద విద్యార్థులకు అందించాలని, ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రభుత్వాలు దానికి భిన్నంగా ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా వసతులు లేకున్నా మోడల్, టెక్నో అని తోక పేర్లతో గల్లిగల్లికి కార్పొరేట్ శక్తులకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు ఏటాయించి, ఉపాధ్యాయ నియమకాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం కలిగించే విధంగా ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి, రమేశ్, దేవేందర్, వేణు, హర్షవర్దన్, స్వప్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

భగత్‌నగర్, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఓల్డ్ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తూ పేద మధ్య తరగతి విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోవవడం లేదని విమర్శించారు. విద్యకు బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టు లను భర్తీచేయాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు కేటాయించాల న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంఈవో పోస్టులు, ఖాళీగా ఉన్న అటెండర్, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, సంపత్, సురేష్ పాల్గొన్నారు.

'బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి'

కరీంనగర్ టౌన్, జూలై 2: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కె రవీంద్రాచారి ఒక ప్రకట నలో డిమాండ్ చేశారు. అంతర్గత రేషనలై జేషన్‌తో ఎస్జీటీ ఉపాధ్యాయులకు నష్టం జరిగిందన్నారు. రేషనలైజేషన్‌తోనే బదిలీలు నిర్వహించి, బదిలీ అయిన ఉపాధ్యా యులను విద్యార్థుల సంఖ్య, రిలీవర్ పేరుతో నిలువరించడం సరికాదని అన్నారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తగినంత మంది విద్యా వలంటీర్లను నియమించి, బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై స్పందించాలి..

- బాధితులకు అండగా నిలవాలి
- బ్యాక్ లాగ్ పోస్టులు, పదోన్నతులపై వివరాలు అందించాలి..
- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్



ఎస్‌సి సంక్షేమంపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్

కరీంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పోలీసులు సత్వరమే స్పందించి బాధితులకు అండగా నిలవాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ అన్నారు. మంగళవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన జిల్లాలో ఎస్సీల సంక్షేమం, తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో 2018 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను వెంటనే నమోదు చేసేలా చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ మేరకు పోలీస్ అధికారులు వెంటనే కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. జిల్లాలో బ్యాక్ లాగ్ పోస్టుల వివరాలు, పదోన్నతులకు సంబంధించిన వివరాలు 15 రోజుల్లోగా అందించాలని ఆదేశించారు. నిరుపేదల ఆర్థిక అభివృద్ధి కోసం బ్యాంకర్లు చేయూత అందించేందుకు రుణాలందించాలన్నారు. అసైన్డ్ భూములకు చట్టబద్ధత కల్పించి పాస్‌బుక్‌లు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లైంగిక దాడులు, హత్యకు గురైన బాధిత కుటుంబాలకు సత్వరమే న్యాయం జరగడంతో పాటువారికి పరిహారం అందించాలని ఆదేశించారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో గుడుంబా విక్రయాలను పూర్తిగా నియంత్రించాలని సూచించారు. అధికారులంతా చట్టాలను గౌరవించాలని, తనకు ప్రొటోకాల్ పాటించే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. అసైన్డ్ భూములకు చట్టపద్ధత కల్పించి పాస్‌బుక్కులు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీపీ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ఫిర్యాదులు అందిన వెంటనే చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. చార్జిషీట్ ఫైల్ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తున్నామన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్. కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు కె మహేశ్వర్, రమేష్‌బాబు, సీపీవో కొమురయ్య పాల్గొన్నారు.

● అన్యాయం జరిగితే మా దృష్టికి తీసుకురండి..

జిల్లాలో ఎస్సీలకు సంబంధించిన భూముల సమస్యలతో పాటు ఏ అంశంపై అన్యాయం జరిగినా బాధితులు తమ దృష్టికి తీసుకురావాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ సూచించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీల భూములు ఎవరైనా ఆక్రమించినా, లాక్కున్నా తమ దృష్టికి తీసుకు రావాలని, దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎసీ, ఎస్టీలను దూషించినా, వారి ఇంటి ముందు చెత్త వేసినా ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి



తెలంగాణ చౌక్‌లో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, జూలై 2: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు నియామకాల విష యంలో నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపిస్తున్నాయన్నారు. గ్రూప్ వన్ మొయిన్స్ 1:100 ప్ర కారం క్వాలిఫై చేయాలని, గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లు అదనంగా పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని కోరారు. నిరుద్యోగులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి బామాండ్ల నందు, మధు, శ్రీవర్ధన్, వంశీ, ప్రశాంత్, విష్ణు, గణేష్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని నిర్వహించాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం నిరసన

కరీంనగర్ రూరల్, జూలై 2: మెగా డీఎస్సీని 25 వేల టీచర్ పోస్టులతో



నిర్వహించాలని, గ్రూప్ 2 నోటిఫికేషన్ ఆదనంగా పోస్టులను పెంచాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు కూకట్ల రమేష్ డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రూప్ వన్ మొయిన్స్‌కు 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదిలను పోస్టు పోన్ చేసి నూతన తేదిలను ప్రకటించాలని, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దేవరకొండ అజయ్, తోట సాయి, నేరెళ్ల సృజన్, దామరపెల్లి శివారెడ్డి, గొల్లపల్లి ప్రవీణ్, దుబ్బాక కిరణ్, దాడి ఆంజనేయులు పాల్గొన్నారు.

జైలుకు వెళ్లి వచ్చినా మారని బుద్ధి

- చోరీకి పాల్పడ్డ నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- 8 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ. 20వేలు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు



వివరాలు తెలుపుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి, జూలై, 2: మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడి తప్పించుకుంటూ తిరుగుతున్న పాత నేరస్తుల్ని పోలీసులు అరెస్టు చేసిన ట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్‌కుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా చెందిన మాదాపూర్ గ్రామస్థుడు దర్పల్లి సాయిలు, బాసరకు చెందిన కొసిడియా మోహన్ పలు చోరీ కేసుల్లో గతంలో జైలుకు వెళ్లి జూన్ 3న విడుదలై బయటకు వచ్చారు. దర్పల్లి సాయిలు చిన్నతనం నుంచి జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతుండేవాడు, భార్యను హింసించడంతో వదిలిపెట్టి పోయింది. అప్పటి నుంచి అతనిపై 20 చోరీ కేసులతో పాటు హైదరా బాద్‌లో మర్డర్ కేసులు కూడా ఉన్నాయి. కొసిడియా మోహన్‌పై 14 చోరీ కేసులు పలు పోలీసు స్టేషన్‌లో కేసులు ఉన్నాయి.

మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన జోగిరి శంకర్ జూన్ 22 ఇంటికి తాళం వేసి షిరిడీ యాత్రకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. జూన్ 24న రాత్రి సమయంలో దర్పల్లి సాయిలు, కొసిడియా మోహన్ తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న 5తులాల బంగారు బిస్కెట్, తులం బంగారు చైను, 2 తులాల బంగారు తీగ, 10 తులాల వెండి కండితో పాటు రూ. 1.50లక్షలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న జోగిరి శంకర్ తిరిగి ఇంటికి వచ్చి విషయాన్ని పోలీసులకు తెలపడంతో కేసు నమోదు చేశాడు. దీంతో క్లూస్ టీం, డాగ్ స్కాడ్‌లతో చుట్టు పక్కల ప్రదేశాలను సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్‌కుమార్ పరిశీలించారు. దొంగలను పట్టుకోవడానికి సీఐ, ఎస్సైలు గాలింపు చర్యలు జరిపారు. ఈ క్రమంలో మంగళవారం గండిహనుమాన్ ఆలయం సమీపంలో దర్పల్లి సాయిలు, కొసిడియా మోహన్‌లు అనుమానాస్పందంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా మేడిపల్లిలో దొంగతనం చేసినట్లు, నిజామాబాద్ జిల్లాలో మూడు బైకులను దొంగిలించినట్లు అంగీకరించారు. వారి నుంచి చోరీ చేసిన బంగారం, వెండి నగలు, రూ. 20వేల నగదు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు తెలిపారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్‌కుమార్, కానిస్టేబుల్ కిరణ్, సంతోష్, చైతన్య, మహేందర్‌లను డీఎస్పీ అభినందించారు.

వేములవాడలో మహిళా కండక్టర్ అత్యుత్సాహం

- ఫ్రీ బస్ కాదని మహిళా ప్రయాణికులను దించిన వైనం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో

వేములవాడ టౌన్, జూలై 2: ఆర్టీసీ బస్సులో మహిళ కండక్టర్ ప్రయాణికులపై అత్యుత్సాహాన్ని ప్రదర్శించిన సంఘటన సోమవారం వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండులో చోటు చేసుకుంది. మహిళ కండక్టర్ ప్రయాణికులతో మాట్లాడిన తీరును అక్కడే వున్న యువకుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఆ వీడియో కాస్తా వైరల్‌గా మారింది. వరంగల్‌కు చెందిన భక్తులు వేములవాడ రాజ రాజేశ్వరస్వామి వారిని దర్శించుకుని తిరిగి కొండగట్టు అంజన్న దర్శనానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు కోసం చూస్తున్న మహిళ ప్రయాణికులకు చేదు అనుభవం ఎదురైంది. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగిత్యాల వెళుతున్న క్రమంలో కొండగట్టు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న మహిళ ప్రయాణికులపై కండక్టర్ కోపాన్ని చూపించింది. ఇది ఫ్రీ బస్సు కాదని, చెకింగ్ ఆఫీసర్‌కు దొరికితే రూ 500 ఫైన్ కట్టాలని, ఒక్కసారి చెబితే వినపడటం లేదని బెదిరించి బస్సులోంచి దించి వేసింది. దీంతో చేసేదేమి లేక ప్రయాణికులు బస్సు దిగిపోయారు. ఈ సంఘటను గమనిస్తున్న ఓ యువకుడు తన సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రికరించి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ఈ విషయంపై డిపో మేనేజర్ మురళికృష్ణను వివవణ కోరగా బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉన్నారని, వేములవాడలోని జగిత్యాల బస్టాండు నుంచి తిప్పాపూర్ బస్టాండ్ వరకు వచ్చే ప్రయాణికులు కావడంతో అలా మాట్లాడిందన్నారు. ప్రయాణికులతో అలా మాట్లాడటం సరైంది కాదని సదరు మహిళ కండక్టర్‌ను డ్యూటీ నుంచి పక్కన పెట్టామని, విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులు పంపిస్తానని తెలిపారు.

స్వదేశానికి రప్పించాలని వేడుకోలు

వెల్గటూర్, జూలై 2: విదేశంలో అనారోగ్యంతో బాధ పడుతున్న వెల్గటూర్ మండలం జగదేవ్‌పేటకు చెందిన వ్యక్తిని స్వదేశానికి రప్పించేలా కృషి చేయాలని ఆయన బంధువులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. బంధువుల సమా చారం ప్రకారం జగదేవ్‌పేటకు చెందిన గంగుల మహేష్ గత సంవత్సరం డిసెంబరు 31న ఉపాధి నిమిత్తం మాల్దీవ్స్‌కు వెళ్లాడు. ఈ మధ్యన అతడు అనారోగ్యానికి గురయ్యాడు. అక్కడ కంపెనీ యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఇండియాకు రావడానికి ఎగ్జిట్ పర్మిషన్ కూడా ఇవ్వడం లేదు. మెరుగైన చికిత్స కోసం మహేష్‌ను స్వదేశానికి రప్పించేలా చూడాలని ఆయన బంధువు కనకయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నారుమడి ధ్వంసం

జగిత్యాలరూరల్, జూలై 2 :జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లికి చెందిన కీలక నేత కొందరు వ్యక్తుల చేత తన నారుమడిని ధ్వంసం చేశారని గుట్రాజ్‌పల్లికి చెందిన కల్లెపల్లి తిరుపతి ఆరోపించారు. గుట్రాజ్‌పల్లికి చెందిన సదరు నాయకుడికి ఎన్నికల్లో అనుకూలంగా పనిచేయనందుకు భూవివాదంలో తలదూర్చి తనపై కక్ష్య సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఖతార్ దేశం నుంచి వీడియో సందేశం ద్వారా తిరుపతి తన ఆవేదన వ్యక్తపరిచాడు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరి అరెస్ట్

మెట్‌పల్లి, జూలై, 2 : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏప్రిల్‌లో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పట్టణంలోని కటకం ప్రకాష్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా కటకం పాన్ బ్రోకర్స్ పేరుతో వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం మేరకు దాడులు చేయడానికి వెళ్లారు. దాడుల్లో ఎలాంటి ఆధారులు లేకుండా అక్రమంగా నిల్వ ఉన్న బంగారం, నగదును సీజ్ చేస్తుండగా కటకం ప్రకాష్, కటకం కార్తీక్‌లతో పాటు కుటుంబ సభ్యులు అడ్డు తగిలి పోలీసులపై దాడికి యత్నిస్తూ, దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపాడు. దీంతో వారిపై కేసు నమోదు చేసి ఈనెల 1న మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కోనేరుకు తాళం


కోనేరు బయట ఉన్న భక్తులు

సారంగాపూర్, జూలై 2 : మండలంలోని దుబ్బ రాజన్న ఆలయంలో కోనేరుకు నిత్యం తాళం వేసి ఉంటోంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు నిరాశతో వెనుతిరిగి వెళ్లాల్సి వస్తోంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజన్న ఆలయానికి ప్రతి సోమవారం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కోనేరు వద్దకు వెళ్లి స్నానాలు చేసి ఆలయానికి వెళ్తారు. మహాశివరాత్రి ఉత్సవాలకు తప్ప ఎప్పుడూ తాళం వేసి ఉంచుతున్నారు. దీంతో ప్రతి సోమవారం వచ్చే భక్తులు కోనేరు వద్దకు వచ్చి చూసి తాళం ఉండటంతతో నిరుత్సాహంతో వెనుదిరిగి వెళ్తున్నారు. కోనేరుకు అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ కూడా అధికారులు తాళం వేసి ఉంచడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల కోరిక మేరకు ప్రతి సోమవారం రోజైనా కోనేరులో నీటిని నింపి అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

రాజన్న కోడెల పంపిణీకి రంగం సిద్ధం

మూడు వందల కోడెలకు వచ్చిన దరఖాస్తులు

వేములవాడ కల్చరల్, జూలై 2: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి భక్తులు సమర్పించే నిజకోడెలను అర్హులైన రైతులకు ఉచితంగా ఉందించేందుకు రంగం సిద్ధమైంది. రాజన్న కోడెలను, ఆవుల సంఖ్య ఎక్కువ పెరగడంతో ఆసక్తి గల అర్హులైన హిందూ మతానికి చెందిన రైతులు, ఆలయ గోశాలలు, ప్రైవేటు గోశాలలు, హిందూమఠాల వారికి అందించేందుకు రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నెల 9వ తేదీ వరకు ఆసక్తి గల వారు రాజన్న కోడెలకు ఆన్‌లైన్ ద్వారా, పోస్ట్ లేదా నేరుగా రాజన్న ఆలయంలో వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి దరఖాస్తులకు ఆహ్వానాన్ని పలికారు. మంగళవారం వరకు మూడు వందల దరఖాస్తులు వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు.

నేడు ప్రభుత్వ విప్ చేతుల మీదుగా పంపిణీ..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి తిప్పాపూర్ గోశాల నుంచి కోడెలను దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా అందించనున్నట్లు ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ప్రతాప నవీన్ మంగళవారం తెలిపారు. రాజన్న కోడెలు కావాలని సుమారుగా మూడు వందల దరఖాస్తులు వచ్చాయని వారికి బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు రాజన్న కోడెలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్, జూలై 2: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పలనర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గోస్కుల సూర్యప్రకాష్‌కు హన్మకొండ జిల్లా వేలేరుకు చెందిన వేముల వెంకటమల్లు రెండో కుమార్తె కవితతో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందన్నారు. గోస్కుల సూర్య ప్రకాష్ ఐదు సంవత్సరాల నుంచి తన భూమిని అమ్ముతానని అంటుండడంతో పిల్లల భవిష్యత్తు గురించి భూమి అమ్మ వద్దని కవిత అడ్డు చెప్పేదన్నారు. అయినా వినకుండా సూర్యప్రకాష్ సగం భూమిని అమ్మేశాడన్నారు. మిగతా భూమినైనా పిల్లల మీద మీద చేపించమని కవిత అడుగుతుంటే భర్త సూర్య ప్రకాష్, అత్త సులోచన, మామ మొగులయ్యలు అవమానించి, వేధింపులకు గురి చేశారని, దీంతో తన కూతురు కవిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కవిత తండ్రి వెంకటమల్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలి

● ప్రభుత్వ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి ● ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారం అందించాలి ● జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వి రాంచందర్

సిరిసిల్ల, జూలై2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ అధికారులు, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పారదర్శకంగా ప్రజలకు సేవలను అందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని అడిటోరియంలో ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌బాబు, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, రీసెర్చ్ అధికారి డి వరప్రసాద్‌తో కలిసి సమీక్షించారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, విద్య, వైద్యం, రుణాలు, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ఎస్సీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను కలెక్టర్ వివరించారు. జిల్లా అధికారులు, శాఖల వారీగా తమ నివేదికలు చదివి వినిపించారు. అట్రాసిటీ కేసుల వివరాలు, ప్రగతిని తెలిపారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారి క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ నియామకాల్లో రూల్‌ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించాలని ఆదేశించారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



రామచంద్రంను సన్మానిస్తున్న కలెక్టర్

● దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారిపై చట్టరీత్యా చర్యలు

జిల్లాలో గతంలో జరిగిన నేరేళ్ల ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, రామరా జ్యంలో రావణకాష్టం జరిగిందని దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచంద్రం తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమిషన్ సభ్యుడు రాంచంద్రం ఎదుట నేరేళ్ల బాధితులు ఈశ్వర్, చెప్యాల బాలరాజు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఒక బాధితుడికి రెండు కిడ్నీలు పాడయ్యాయని అతనికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ నేరేళ్ల ఘటనలో బాధితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారికి ప్రమోషన్ వచ్చిందనే విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నేరేళ్ల ఘటనలో ఉన్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి తన వంతు కృషి చేస్తానని, నేరేళ్ల బాధితులకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నేరేళ్ల బాధితులకు న్యాయం జరగలేదని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ జరపాలని సూచిస్తామన్నారు. ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్‌భూముల పట్టాలు అందించే అవకాశంపై అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశామని అన్నారు. విదేశీ విద్యా పథకం, గురుకుల పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులకు అందుతున్న భోజనం వసతి సౌకర్యం, బెస్ట్ అవెలెబుల్ స్కూల్స్‌పై సమీక్షించామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో సకాలంలో పరిష్కారం చూపాలని, వీటిపై పార్లమెంట్‌లో 2018లో 18ఏ సెక్షన్ కింద ఎస్సీలకు అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్థులను అరెస్ట్ చేయాల్సి ఉంటుందని అన్నారు. అన్యాయం జరిగిన ప్రజలకు అండగా కమిషన్ ఉంటుందన్నారు. సమావేశంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బాబు, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఒడిశా టూ వేములవాడ

● గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
● 14.59కిలోల గంజాయి సీజ్

వేములవాడ టౌన్, జూలై 2: గుట్టుచప్పుడుకాకుండా ఓ వ్యక్తి ఒడిశా నుంచి వేములవాడకు గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నాడన్న పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో టౌన్ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం మీడియా సమావేశంలో నిందితుడిని అరెస్ట్ చూపి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రానికి చెందిన పుర్బీ బిర్ష అనే వ్యక్తి ఒడిశాలోని నబరంగాపూర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి వేములవాడ, సిరిసిల్ల చుట్టుపక్కల ప్రాంతాలలో గంజాయికి అలవాటు పడినవారికి విక్రయిస్తున్నాడని అన్నారు. గంజాయిని ఎక్కువ ధరకు విక్రయించేందుకు వేములవాడకు వస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో పోలీసులు పకడ్బందీగా పట్టణంలోని చెక్కపల్లి రోడ్డు శివారులోని పెద్దమ్మ ఆలయం సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా పట్టుకున్నారని తెలిపారు. అతని వద్ద వున్న బ్యాగ్‌ను తెరిచి చూడగా 14 కిలోల 590 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. గంజాయి కొన్నా, సేవించినా, రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత గంజాయి భారినపడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి అక్రమ గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 41 కేసులలో 99 మందిని అదుపులోకి తీసుకుని 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయికి అలవాటు పడిన వారిని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి గంజాయి వలన కలిగే అనర్థాలపై, కేసులపాలైతే జరిగే నష్టాల గురించి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. గంజాయికి అలవాటు పడి మానుకోలేని స్థితిలో ఉన్నవారి కోసం జిల్లాలో డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి వైద్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తు న్నామని వివరించారు.జిల్లాలో గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసినా, చూసినా 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలన్నారు.

విద్యుత్ మోటార్ల దొంగను పట్టుకున్న రైతులు

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

రామడుగు,జూలై2: గత కొద్ది నెలలుగా రామడుగు మండలంలోని వివిధ గ్రామాల్లో వరద కాలువకు అమర్చుకున్న మోటార్లు, వైర్ కేబుల్‌లను ఎత్తుకెళ్తూ రైతులకు మనశ్శాంతి లేకుండా దొంగను ఎట్టకేలకు మంగళవారం రైతులు పట్టుకున్నారు. మరో ఇద్దరు దొంగలు పారిపోయారు. పట్టుకున్న దొంగను రైతులు పోలీసులకు అప్పగించారు. రైతుల కథనం ప్రకారం.. రామడుగు మండలం షానగర్ గ్రామ శివారులోని వరదకాలువ పంట పొలాల కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్లను గత కొద్ది నెలలుగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడుతూ రైతులకు కునుకులేకుండా చేస్తున్నారు. అయితే రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిఘా పెట్టి రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. మంగళవారం వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తితో పాటు మరో ఇద్దరు వైర్లు దొంగిలించే ప్రయత్నంలో రైతులు ఒక దొంగను పట్టుకోగా మరో ఇద్దరు పారిపోయారు. అనంతరం పోలీసులకు అప్పగించినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం ఓ దొంగ పోలీసుల అదుపులో ఉండగా సదరు వ్యక్తిని విచారిస్తున్నట్లు తెలిసింది.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

పెద్దపల్లి రూరల్ , జూలై 2 : మండలంలోని నిట్టూరు గ్రామ శివారులో మంగళవారం ట్రాక్టర్ ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతిచెందడంతో పాటు , ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన ఆరే సదయ్య అతని భార్య లక్ష్మీ (38)లు చొప్పదండిలో బోనాల పండుగకు ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న తరుణంలో నిట్టూరు గ్రామం వద్ద ట్రాక్టర్ రాంగ్ రూట్‌లో రావడంతో ఢీకొట్టగా లక్ష్మీ అక్కడికక్కడే మృతిచెందింది. సదయ్యకు తీవ్ర గాయాలైనట్లు సదయ్య సోదరులు కుమార్ తెలిపారు. రాంగ్ రూట్‌లో ట్రాక్టర్ నడుపడంతో పాటు ఒకరి ప్రాణాన్ని బలిగొన్న డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి పోలీసులకు కుమార్ ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

పెద్దపల్లి రూరల్ , జూలై 2: మండలంలోని పెద్దకల్వల గ్రామం వద్ద మంగళవారం కారు ఢీకొని దరావత్ సత్తమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యదాద్రి భువనగిరికి చెందిన దరావత్ సత్తమ్మ బతుకుదెరువు కోసం పెద్దకల్వల గ్రామంలో నివాసం ఉంటోంది. మంగళవారం సాయంత్రం రాజీవ్ రహదారి దాటుతుండగా కారు ఢీకొనడంతో సత్తమ్మ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి మనువడు దరావత్ వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గొల్లపల్లి, జూలై 2: మండలంలోని అగ్గిమల్ల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ జీవితం మీద విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మాహత్యాయత్నం చేసిన పాల సురేష్ (44) పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సురేష్ కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రోగం నయం కోసం పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరి లక్షలు వెచ్చించి వైద్యచికిత్స చేయించకున్నప్పటికీ నయం కాలేదు. దీంతో జీవితం మీద విరక్తి చెంది గత నెల 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్య చికిత్స నిమిత్తం హుటాహుటిన జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. మూడు రోజుల అనంతరం పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలు

శంకరపట్నం, జూలై 2: శంకరపట్నం మండలంలోని కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా మంగపేట మండలం కొత్తపేట గర్‌పెల్లి గ్రామానికి చెందిన చిల్ల సారయ్య రెండేళ్ల కూతురు అంజలితో కలిసి ద్విచక్ర వాహనంపై జగిత్యాల నుంచి సొంత గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కొడూరి మొగిలి అనే వ్యక్తి మోటర్ సైకిల్‌పై కేశవపట్నం నుంచి లింగాపూర్ వైపు వెళ్తున్నాడు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు పక్క పక్కన ఢీ కొన్న ఘటనలో చిల్ల సారయ్యతో పాటు రెండేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. మొగిలికి స్వల్ప గాయాలు కాగా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. గాయపడిన వారిని హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, జూలై 2: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారి సన్నిధికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. నూతన వాహనాలకు స్వామి వారి సన్నిధిలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.

● అంజన్నను దర్శించుకున్న వేములవాడ ఈవో

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా సోమవారం బాధ్యతలు చేపట్టిన వినోద్‌రెడ్డి మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేసి ఆశీర్వదించగా అధికారులు సత్కరించారు. వినోద్‌రెడ్డి హనుమన్ జయంతి వేడుకలకు ఫెస్టివల్ అధికారిగా విధులు నిర్వహించారు.



అంజన్న ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

● ప్రాజెక్టులోకి 4,630 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది. డ్యామ్‌లోకి 4,630 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 10.835 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 15.986 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 465 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 4.615 టీఎంసీల నీరు వచ్చి చేరింది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

హైవోల్టేజీ విద్యుత్‌తో గృహోపకరణాలు దగ్ధం

● రూ. రెండు లక్షల నష్టం

ఎల్లారెడ్డిపేట, జూలై 2: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాపేటలో మంగళవారం హైవోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో పలువురి ఇళ్లలోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. గ్రామంలో దేవేందర్, మైసయ్య, దేవదాస్, దర్వేశ్‌తో పాటు మరో పది మంది కాలనీవాసుల ఇళ్లలో ఒక్కసారిగా అధిక విద్యుత్ సరఫరా అవడం వల్ల ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. సుమారు రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. సంబంధిత శాఖ అధికారులు హైవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మద్దతు ధరల చట్టం అమలు చేయాలి

● రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మిల్కూరి వాసుదేవరెడ్డి


జమ్మికుంట, జూలై 2: కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరల చట్టం అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీ చౌరస్తాలో మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఇటీవల పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు సహేతుకంగా లేవన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న రైతుల పెట్టుబడిని పరిగణలోకి తీసుకోలేదని, మద్దతు ధరలను వెంటనే సవరించాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు 25శాతం పెరిగాయని, కేంద్ర వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చు తగ్గించి చూపిస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలన్నారు. కూరగాయలకు కూడా మద్దతు ధర ప్రకటించాలన్నారు. మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి కనీస మద్దతు ధరల చట్టాన్ని చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాసిర సంపత్ రావు, శీలం అశోక్, కొప్పుల శంకర్, జక్కుల రమేష్, రావుల ఓదేలు, కుమార్, సమ్మయ్య, సంజీవ్, పోచయ్య, కరుణాకర్, రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చొప్పదండి, జూలై2: గత నెల 26న పురుగుల మందు త్రాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ ఉపేంద్ర చారీ తెలిపిన కథనం మేరకు మండలంలోని చాకుంటాకు చెందిన తడిగొప్పుల మహేందర్ (27) రెండు నెలల క్రితం 6లక్షల రూపాయలను అప్పు చేసి నగునూర్‌లో పెయింట్స్ దుకాణం ప్రారంభించాడు. వ్యాపారంలో నష్టంరావడంతో అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది గత నెల 26న ఇంటిలో పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహేందర్ మృతి చెందినట్లు తెలిపారు. మహేందర్ తండ్రి కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హుజూరాబాద్ రూరల్, జూలై 2: మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో సోమవారం రాత్రి మృతి చెందగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామానికి చెందిన గాజబోయిన మల్లయ్య(37) అనే వ్యక్తి తన అత్తగారి తరుపున వచ్చిన పొలంతో పాటు అత్తగారి పొలం దున్నడానికిగాను బురద బట్టలు తీసుకుని సోమవారం సాయంత్రం వెళ్లాడు. మల్లయ్య ఫోన్‌కు భార్య లావణ్య ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. కాగా మంగళవారం ఉదయం అటుగా మల్లయ్య అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. పొలం దున్నడానికి వెళ్లిన మల్లయ్య తన పొలం దగ్గరకు వెళ్లకుండానే మధ్యలో శవమై కనిపించాడు. చనిపోయిన చోట ట్రాక్టర్ రౌండ్‌లు వేసినట్లు ఉండటం, కొంచం ముందుకు వెళ్లేసరికి మళ్లీ అలాగే ఉండటం, చేతులకు దెబ్బలు తాకి రక్తం కారుతుండటంతో ఇది అనుమానాస్పద మృతిగా కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. విషయం పోలీసులకు తెలియజేయటంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.



పొలంలో గాజ మల్లయ్య మృతదేహం



మల్లయ్య(ఫైల్)

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 2: మండలంలోని పైడిపల్లి గ్రామానికి చెందిన రుద్ర సత్తయ్య (46) అనే వ్యక్తి మంగళవారం అప్పుల బాధతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సత్తయ్య డిష్ కాంట్రాక్ట్ తీసుకొని ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నష్టాలు రావడంతో గ్రామంలో కొందరి వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు ఎలా తీర్చాలని మనోవేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారు జామున తన భార్య పిల్లలు బయట నిద్రిస్తుండగా ఇంటిలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సత్తయ్య భార్య రుద్ర మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై వివరించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, జూలై 2: తంగళ్లపల్లి మండలం నేరళ్ల గ్రామానికి చెందిన యువకుడు ఐతం అజయ్ (26) మద్యానికి బానిసై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం... గ్రామానికి చెందిన ఐతం విజయ కుమారుడు అజయ్ మద్యానికి బానిసయ్యాడు. తండ్రి సత్తయ్య 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి విజయ కూలీ చేస్తూ కుమారుడిని పెంచి పోషిస్తోంది. కొద్ది రోజులుగా మద్యానికి బానిసైన అజయ్ తల్లిని సైతం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి డబ్బులు లేక మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అజయ్(ఫైల్)

అదుపుతప్పి బోల్తా పడిన మినీ బస్సు

● డ్రైవర్‌కు తప్పిన ప్రాణాపాయం

సిరిసిల్ల క్రైం, జూలై 2: సిరిసిల్ల పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో మినీ బస్సు బోల్తా పడింది. మంగళవారం వేములవాడ నుంచి కామారెడ్డి వైపు వెలుతున్న మినీ బస్సు సిరిసిల్ల రెండో బైపాస్ రహదారిలో అదుపుతప్పి ఎదురుగా ఉన్న రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ స్వల్పగాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ప్రమాద సంఘటనను చూసిన ఆ ప్రాంతంలోని రైతులు వెంటనే చేరుకొని డ్రైవర్‌ను బయటకు తీశారు. అతివేగంగా వెళ్లడం వల్లనే మినీబస్సు బోల్తాపడినట్లు స్థానికులు చెప్పారు. మినీబస్సులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో అక్కడికి వచ్చిన వారు ఊపిరి పీల్చుకున్నారు.

కుటుంబ సమస్యలతో యువకుడి ఆత్మహత్య

కోనరావుపేట జూలై 2: కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కోనరావుపేట మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు.. పోలీసుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన పల్లి శ్రీకాంత్ (37) అనే యువకుడు కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. భార్య మధూష ఆరోగ్యం బాగాలేక నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. శ్రీకాంత్ మద్యానికి బానిస అయ్యాడు. మంగళవారం ఉదయం కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లి మండల శివారులోని ఓ వ్యవసాయ బావిలో దూకి తాగిన మైకంలో ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ బావి రోడ్డు పక్కనే ఉండడంతో బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు బావిలో దూకుతుండగా చూసి కాపాడే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే బావిలో మునిగిపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్ఐ ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు రిషిక్, కూతురు శాన్విక ఉన్నారు.



శ్రీకాంత్ (ఫైల్)

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ఇల్లంతకుంట, జూలై 2: మండలంలోని పత్తికుంటపల్లె గ్రామానికి చెందిన గుడిసె బాలమల్లు (50) అప్పులబాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. బాలమల్లు మద్యానికి బానిస కావడంతో పాటు కుమార్తె వివాహం చేయడంతో అప్పులు అయ్యాయి. దీనితో భార్య ముత్తవ్వతో తరుచూ గొడవ పడుతుండేవాడు. రెండు రోజుల క్రితం ముత్తవ్వ హైద్రాబాద్‌లో ఉండే కుమారుడి వద్దకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతురాలి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

● వృద్ధుడికి గ్రామస్థుల దేహశుద్ధి

కాల్వశ్రీరాంపూర్, జూలై 2: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఓ గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికపై 65 సంవత్సరాల వృద్ధుడు లైంగిక దాడికి యత్నించాడు. గ్రామంలోని ప్రభుత్వ సామూహిక మరుగుదొడ్ల వద్దకు మంగళవారం బహిర్భూమికి బాలిక వచ్చింది. మద్యానికి బానిసైన అదే గ్రామానికి చెందిన వృద్ధుడు బాలికను వెంబడించి వెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయాన్ని గమనించిన అక్కడున్న గ్రామస్థులు వృద్ధుడికి దేహశుద్ధి చేసి బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలిక కుటుంబ సభ్యులు ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేపు ఉమ్మడి జిల్లా బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై2: ఉమ్మడి జిల్లా బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను గురువారం నిర్వహించనున్నామని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ గణపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 9గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే ఉమ్మడి జిల్లా క్రీడాకారులను మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల రెండవ వారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీలో పాల్గొనుటకు ఆసక్తి గల క్రీడాకారిణిలకు 2011 జనవరి 1 నుంచి 2012 డిసెంబరు 31 మధ్య కాలంలో జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. క్రీడాకారిణిలు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, జనన ధ్రువీకరణ పత్రంతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 9గంటలకు సంఘం ఉపాధ్యక్షుడు శంకరయ్యను మైదానంలో సంప్రదించాలని సూచించారు.

నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ వాహనాల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై2: పెండింగ్ చలాన్లు , వాహనాల నంబర్‌ప్లేట్ ట్యాంపరింగ్‌లపై కరీంనగర్‌లో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పట్టుకున్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐలు కరీముల్లాఖాన్, పర్స రమేష్, ఆర్ఐ స్వామి, ఆర్ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ ఇషాక్ అహ్మద్, సిబ్బందితో కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట నాకా బందీ నిర్వహించారు. నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, సౌండ్ పొల్యూషన్ వెహికిల్స్‌పై ఉన్న 72 ఈ చలాన్లను వాహన యజమానుల నుంచి జరిమానాలు చెల్లింపు చేశారు. నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, సౌండ్ పొల్యూషన్ ఉన్నచో కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్ హెచ్చరించారు.

అతిగా మద్యం సేవించి యువకుడి మృతి

ధర్మపురి, జూలై 2: ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద నల్ల మల్లేష్ (35) అనే తాపీ మేస్త్రీ సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించి నిద్రలో మృతి చెందాడు. దండేపల్లి మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ ఆరు ఏళ్ల క్రితం భార్యకు విడాకులు ఇచ్చి తల్లితో కలిసి ఇక్కడే ఉంటున్నాడు. మద్యానికి బానిసై ఎక్కడపడితే అక్కడే పడుకుంటున్నాడు. గత రాత్రి అతిగా తాగి కమలాపూర్ చౌరస్తా వద్ద పడుకొని ఉండగా నిద్రలోనే మృతి చెందాడు. మల్లేష్ తల్లి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా కరెంట్ బిల్లుల చెల్లింపులు నిలిపివేత

గణేశ్‌నగర్, జూలై 2: ఆర్బీఐ ఆదేశాల ప్రకారం యూపీఐ, సర్వీస్ ప్రొవైడర్లు ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే, గూగుల్ పే, బ్యాంకుల ద్వారా కరెంట్ బిల్లుల చెల్లింపులు నిలిపివేస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. ఈ క్రమంలో బుధవారం నుంచి టీజీఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ www.tgnpdcl.in ద్వారా లేదా టీజీఎన్‌పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా మాత్రమే కరెంట్ బిల్లులు చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. టీజీఎన్పీడీసీఎల్ యాప్‌లో గానీ లేదా డిస్కం వెబ్‌సైట్‌లో గానీ బిల్లులు చెల్లించునప్పుడు మీరు ఫోన్ పే, గూగుల్ పే, పేటీ ఏం, లేదా ఇతర యూపీఐని వాడవచ్చు. డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్, క్యాష్ కార్డ్ కూడా వాడవచ్చు. ఎన్‌పీడీసీఎల్ బిల్‌డెస్క్ ద్వారా కూడా చెల్లించవచ్చు. ఏమైనా సందేహాలుంటే కరీంనగర్ సర్కిల్ కంట్రోల్ రూమ్ సెల్‌నెం.9440811444లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ రూరల్, జూలై2: కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం టాస్క్‌ఫోర్స్, కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణా జరుతుందన్న సమాచారం మేరకు పోలీస్ అధికారులు దాడులు నిర్వహించారు. గొల్లపల్లి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని రూరల్ పోలీసులు హెచ్చరించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, జూలై2: నగరంలోని భగత్‌నగర్ అంజ నాద్రిపై అనంత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం అంగారక కృత్తికా నక్షత్రం సందర్భంగా స్వామివారికి విశేష అభిషేక అలంకరణలు, అర్చన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్, జూలై2: కృతికా నక్షత్రం సందర్భంగా మంగళవారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలో కొలువై ఉన్న ఉమాసు తుడూన శ్రీ వల్లిదేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి వారులకు ఆలయ ధర్మాధికారి వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పవన కృష్ణ శర్మ విశేష స్వామి వారలకు అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేషహారతి, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

కరీంనగర్ అర్బన్, జూలై2: కరీంనగర్ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రామచందర్‌ను మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సత్కరించారు. కరీంనగర్‌లో మంత్రిని పొన్నంను జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రామచందర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

●భగత్‌నగర్, జూలై2: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌ను బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి మంగళవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సత్కరిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సమస్యలపై దళిత విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీ బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీలను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత నాయ కులు సుద్దాల లక్ష్మణ్, ఎర్రోళ్ల ప్రశాంత్, గజ్జల ఆనంద్ పాల్గొన్నారు.

వైభవంగా 'అపరా' ఏకాదశి ఉత్సవం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పురోహితులు

కరీంనగర్ కల్చరల్, జూలై2: స్థానిక తిరుమలనగర్ మయూరగిరి పీఠంలో (శ్రీనిలయం) మంగళవారం జ్యేష్ఠ బహుళ ఏకాదశి సందర్భంగా 'అపరా' ఏకాదశి ఉత్సవాన్ని మయూరగిరి పీఠాధిపతి, జ్యోతిష, వాస్తు, ఆగమ శాస్త్ర పండితుడు నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. నారాయణునికి ప్రత్యేక పూజలతో పాటు లక్ష్మీనారాయణ, శ్రీసూక్త హవనం, పూర్ణాహుతి చేశారు. అనం తరం విష్ణు సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణాలు, భజనలు జరిగాయి. లోక కల్యాణార్థం జ్యేష్ఠ మాసంలో వచ్చే ప్రతీ ఏకాదశికి ఉన్న పేర్లతో ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు శ్రీరామ సేవా తరంగిణి ట్రస్టు బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణమాచార్యులు, గీతాచార్యులు, రమేశ్‌స్వామితో పాటు వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలి

హుజూరాబాద్, జూలై 2: ప్రభుత్వ పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్ వెంకటేష్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కొన్ని పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటికి నూతన భవనాలు నిర్మించాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, మంచినీరు తదితర సదుపాయాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము, వేణుగోపాల్, శివమణి, రోహిత్, సందీప్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటకు అర్ధరాత్రి వరకు బస్సులు

● హైదరాబాద్‌కు సైతం బస్సు వేయిస్తా

● రాష్ట్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

జమ్మికుంట, జూలై 2: హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు రాత్రి 12గంటల వరకు ఆర్టీసీ బస్సు నడిచే విధంగా చూస్తానని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి సోదరుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృత్యువాత పడిన విషయం తెలిసిందే. మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ పత్తి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని డాల్ఫిన్ హోటల్‌లో సమోస తిని, చాయ్ తాగారు. కాసేపు అందరితో సరదాగా గడిపారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జమ్మికుంట నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు వేయాలని, అదేవిధంగా హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు రాత్రి 12గంటల వరకు బస్సు నడిచే విధంగా చూడాలని మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఉదయం ఐదు గంటలకు జమ్మికుంట నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు వేయిస్తానని చెప్పారు. ఐదు గంటల బస్సు ప్రయాణికులతో నిండితే, ఏడు గంటలకు మరో ఎక్స్‌ప్రెస్ బస్సు కూడా నడిచే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దేశిని కోటి, తుమ్మేటి సమ్మిరెడ్డి, పొనగంటి మల్లయ్య, మొలుగూరి సదయ్య, సుంకరి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా జమ్మికుంట సీనియర్ పాత్రికేయులు అకినపల్లి సంపత్ తండ్రి అకినపల్లి రాజేశ్వర్‌రావు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి



నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

శంకరపట్నం, జూలై 2: శంకరపట్నం మండలంలోని చింతగుట్ట గ్రామానికి చెందిన కరివేద సదాశివరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సదాశివరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య తదితరులున్నారు.

● మానకొండూర్ : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన గద్రెపల్లి రాజమ్మ అనే వృద్ధురాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ సర్పంచు పెంచాల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు కనుక రాజేశం, నీరటి మెగిలి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, లక్ష్మయ్య, కాశీనాథం, కోటయ్య తదితరులు ఉన్నారు.


వీణవంకలో పోచమ్మ బోనాలు

వీణవంక, జూలై 2: వీణవంక మండల కేంద్రంలో పోచమ్మ బోనాలను మంగళవారం ఘణంగా నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని బస్టాండ్ కూడలి నుంచి ఎల్లమ్మ గుడికి వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

రూ.7,500 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,500 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 184క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7500, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించారు.

ఎస్‌యూ వీసీగా బీసీని నియమించాలి



మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంఘం నాయకులు

గణేశ్‌నగర్, జూలై2: శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స లర్‌గా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 2008లో కాంగ్రెస్ హయాంలో ప్రారంభమైన శాతవాహన యూనివర్సిటీకి వీసీగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించ లేదని అన్నారు. ఈసారైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ చూపి శాతవాహన యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్ బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దానికి మంత్రి సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నర్సింగోజు, సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, బీసీ సంక్షేమ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూప, యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొని శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు షెడ్లు నిర్మించాలి

సుభాష్‌నగర్/భగత్‌నగర్, జూలై2: కొత్తపల్లి పట్టణంలో గొర్రెల కోసం షెడ్లు నిర్మించాలని కొత్తపల్లి గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లిలో గొర్రెలు, మేకలు మేపడం కోసం ప్రస్తుతం పరిస్థితులు అనువుగా లేవన్నారు.

దాంతో గొర్లను మేపేందుకు అడవులకు వెళుతున్నారని, అక్కడ క్రూర మృగాల బారి నుంచి గొర్లను కాపాడుకుంటూ, తిరిగి వస్తున్న క్రమంలో కాపరులే మృగాల బారిన పడి ప్రాణాలు కూడా కోల్పోతున్నారని వాపోయారు. గత ప్రభుత్వం సిద్దపేట జిల్లాలో 10ఎకరాల ప్రభుత్వ స్థలంలో గొర్రెలు, మేకల పెంపకం కోసం షెడ్లను నిర్మించారని తెలిపారు. దాంతో గొర్రెలు, మేకలను అందులో ఉంచి మేపుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. అదే తరహాలో కొత్తపల్లిలో ప్రభుత్వ స్థలంలో గొర్రెల కోసం షెడ్లు నిర్మించాలని మంత్రిని కోరారు.

కాలువల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి

కరీంనగర్ రూరల్, జూలై2: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ శివారులో పంట కాలువలు ఆక్రమణలకు గురై 50ఎకరాలకు నీరు అందలేక పోతుందని వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంగళవారం కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు వినతిపత్రం అందించారు. ఐదు సంవత్సరాలుగా బొమ్మకల్ గ్రామ మల్లయ్య చెరువు అలుగు ద్వారా వచ్చే నీరు, కొత్త కాలువ ద్వారా మానేరు వాగు వరకు గతంలో కాలువ ఉన్నాయన్నారు. ప్రస్తుతం కాల్వ ఆక్రమణల ద్వారా అలుగు నీరు, కొంగల గుండు పరివాహక రైతు పంట పొలాల రైతులు పంటలు పండించుకోలేక పోతున్నారని, దాదాపు 50ఎకరాలు పంట నష్టపోతున్నామని వారు తెలిపారు. అధికారులు కాలువ నిర్మాణం చేపట్టి, పంట పొలాలు, రైతులకు నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

భగత్‌నగర్, జూలై 2: స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట, బావుపేట గ్రామాల్లో యూత్ సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమల్లో స్థానిక ఉన్న యువతకు ఉపాధి కల్పించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయక పోవడం వల్ల నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు కోల్పోయి ఆత్మ బలిదానాలు చేసుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో భాస్కర్‌నాయక్, రాజ్‌కుమార్, అభిలాష, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

హుజూరాబాద్, జూలై 2: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజ నాన్ని మంగళవారం యువజన కాంగ్రెస్ నాయకులు పరిశీ లించారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు కల్పిస్తున్న మౌలిక సదు పాయాలు, మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో, రుచికరంగా అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నరేష్, రవీందర్, శ్రావణ్, అనిల్‌కుమార్, విష్ణువర్ధన్, సాయితేజ పాల్గొన్నారు.

నియామకం

హుజూరాబాద్‌రూరల్, జూలై2: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన బండారి లావణ్యను తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా మహిళ అధ్యక్షురాలిగా నియమిస్తూ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్ మంగళవారం నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందించారు. తన నియామకానికి సహకరించిన ముదిరాజ్ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేషం ముదిరాజ్, రాష్ట్ర యువత అధ్యక్షులు పండుగ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆసియా క్రీడల్లో యోగాకు స్థానంపై సంబరాలు



క్రీడా పాఠశాలలో స్వీట్లు పంపిణీ చేస్తున్న రవీందర్‌సింగ్

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై2: ఆసియా క్రీడల్లో యోగాకు చోటు కల్పించడంతో జిల్లాలో ఆనందోత్సవాలు వెల్లువిరిసాయి. భారతదేశ వారసత్వానికి ప్రతీకైన యోగాను 2026జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో ప్రదర్శన క్రీడగా, 2030లో కత్తర్ దేశంలో జరిగే ఆసియా క్రీడల్లో పతకాలు అందించే క్రీడగా ఒలంపిక్ కౌన్సిల్ ఆఫ్ ఉసియా కార్యవర్గ సమావేశం సోమవారం వెల్లడించింది. దీంతో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో సంబరాలు నిర్వహించారు. యోగ క్రీడాకారులతో పాటు విద్యార్థులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యా యులు, సంతోషంగా స్వీట్లు పంచుకున్నారు. యోగాలో రాణించే క్రీడాకారులకు భవిష్యత్తులో ఉజ్వల భవిష్యత్తు ఉండనుందని ఈ సందర్భంగా తెలం గాణ యోగా అసోసియేషన్ చైర్మన్, జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ సింగ్ తెలి పారు. క్రీడా రంగానికి ఇది శుభపరిణామం అన్నారు. మనదేశీయ క్రీడా యోగాకు అంతర్జా తీయ వేదికల్లో మనదేశ క్రీడాకారులు పాల్గొని సత్తా చాటే అవకాశం కలిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు టి.రమేష్‌రెడ్డి, క్రీడా పాఠశాల ప్రిన్సి పాల్ నీల ప్రసాద్, యోగా కోచ్ కిష్టయ్య, ఇతర కోచ్‌లు ఇందిర, పవన్‌సాయి, సాగర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను అరికట్టేందుకు పోరాటం



మాట్లాడుతున్న జక్కని సంజయ్‌కుమార్

శంకరపట్నం, జూలై 2: మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం శంకరపట్నం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శంకరపట్నం మండలంలో మాదకద్రవ్యాల వినియోగం రోజు రోజుకు పెరుగుతుందన్నారు. పిల్లలు, యువత మాదకద్రవ్యాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. మండలంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు వెళ్తామన్నారు. గ్రామాల్లో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఈసమావేశంలో మండలా ధ్యక్షుడు బొంగోని అభిలాష్, ఎంఆర్ పీఎస్ మండలాధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్, టీడీపీ నాయకుడు ఆరిఫ్, నాయకులు చల్లూరి రాజేందర్, కొడూరి మహేష్, సామల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం నిరసన



తిమ్మాపూర్‌లో తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేవైఎం నిరసన

తిమ్మాపూర్, జూలై2: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే తరహాలో నిరుద్యోగులను విస్మరిస్తోందని ఆరోపించారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్లు కేటాయించాలని, జీవో నెం 46ను వెంటనే రద్దు చేయాలని, 25వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బి.సాగర్, ఎం.అఖిల్, కె.సంపత్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● గన్నేరువరం: నిరుద్యోగ యువకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పర్తి నిఖేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఓబిసి నాయకులు మచ్చ బాలరాజు, జిల్లా సోషల్‌మీడియా కోకన్వీనర్ మచ్చ మురళి, గట్టు కిషన్, బీజెవైఎం నాయకులు వినయ్, అజయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

● మానకొండూర్ : రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగ జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మండల బిజేవైఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బి. ప్రదీప్ మాట్లాడుతూ నీళ్ళు, నిధులు నియామకాల పేరుతో అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోలేదని ఆరోపించారు. నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రంభుత్వం స్పందించి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, లేని యెడల పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. బలరాం, అంజనేయులు, వరప్రసాద్, మహేశ్, అజయ్, కోటేశ్వర్, శ్రీనివాస్ ఉన్నారు.

● గంగాధర : నిరుద్యోగ సమస్యలపై బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు.ఈసందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కొత్త ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపుతుందన్నారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శశీదర్‌రెడ్డి,మండలాధ్యక్షుడు దయ్యాల ప్రణయ్ పాల్గొన్నారు.

రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ



ఇల్లందకుంటలో మాట్లాడుతున్న కేడీసీసీ వైస్ చైర్మన్ రమేష్



కురిక్యాలలో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ తిరుమల్‌రావు

ఇల్లందకుంట, జూలై 2: మండల కేంద్రంలోని ఇల్లందకుంట సింగిల్ విండో అధ్యక్షుడు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిలి రమేష్ అధ్యక్షతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో ఆదిత్య ఆధ్వర్యంలో రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పదెకరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరికీ రైతు భరోసా అందించాలని ఇన్‌కమ్ టాక్స్ కట్టే వారికి కూడా వర్తింపజేయాలని సూచించారు. అదేవిధంగా బోగంపాడు సింగిల్ విండో చైర్మన్ కొళ్లెం సత్యనారాయణరెడ్డి, మల్యాల సింగిల్ విండో చైర్మన్ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతు వేదికలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రిజిస్టర్ మనోజ్, ఆడిటర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్లు షఫీ, వీరస్వామి, కొంరెల్లి, సీఈవోలు శ్రీనివాస్, దేవేందర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

● గంగాధర: సాగు చేసే ప్రతి గుంటకు రైతు బంధు భరోసాను అందించాలని కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్‌రావు అన్నారు. మంగళవారం గంగాధర,కురిక్యాల రైతు వేదికల్లో రైతుబంధుపై రైతుల అభిప్రాయా సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలిచాల తిరుమల్‌రావు మాట్లాడుతూ సాగు చేస్తున్న తోటలు, వరి, ఆరుతడి పంటలకు రైతు బంధు వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈసందర్భంగా ఎస్సీలకు సాగు చేసుకుందేకు ఇచ్చిన ప్రభుత్వ భూములకు రైతుబంధు ఇవ్వాలని, వ్యవసాయ యోగ్యం కాని భూములకు తప్ప అందరికి, కౌలు రైతులకు సైతం రైతుబంధు సహాయం అందించాలని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 2 వేలను 4వేలకు పెంచాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అర్షురుద్దీన్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, వైస్ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, ఆయా సింగిల్ విండోల పాలకవర్గం పాల్గొన్నారు.

● రామడుగు: రామడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న రైతుబంధు పథకంలో మార్పులు, చేర్పులకు సహకార సంఘం సభ్యులు, రైతుల అభిప్రాయాలు స్వీకరించి తీర్మాణాలు జిల్లా సహకార అధికారికి పంపించారు. కార్యక్రమంలో పాక్స్ సంఘం అధ్యక్షుడు వీర్ల వెకంటేశ్వర్ రావు, ఉపాధ్యక్షుడు గంట్ల రవీందర్ రెడ్డి,సీనియర్ ఇన్‌స్పెక్టర్ సహకార శాఖ యండి జలలోద్దీన్ పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

భగత్‌నగర్, జూలై 2: జిల్లాలో గురువారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విద్యాసంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీపై అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించి నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలన్నారు. ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునికంటి అనిల్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిటి కుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కొయ్యడ రాకేష్, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చెంచాల మురళి, కంపెల్లి అరవింద్, కసిరెడ్డి సందీప్, రోహిత్, రితీష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ నేత పిన్నింటి రాజు మృతి తీరని లోటు'

భగత్‌నగర్, జూలై 2: పెద్దపల్లి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పిన్నింటి రాజు మరణం పార్టీకి తీరని లోటని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో అన్నారు. పిన్నింటి రాజు ప్రజల మనిషి, కార్యకర్తలకు సామాన్యులకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కారానికి నిరంతరం కృషి చేసే రాజు లేరనే వార్త కలిచి వేసిందన్నారు. బీజేపీలో సామాన్య కార్యకర్తగా మొదలై టౌన్ ప్రెసిడెంట్, జిల్లా కార్యదర్శితో పాటు అనే పదవులు చేపట్టారన్నారు. రైతులు, కార్యకర్తలే కాకుండా సామాన్య ప్రజలకు ఏ ఇబ్బంది ఇచ్చినా సాయం అందించే వారన్నారు. పిన్నింటి రాజు మరణం పార్టీకి, పెద్దపల్లి నియోజక వర్గానికి తీరని లోటన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న చకిలం స్వప్న

సుభాష్‌నగర్, జూలై 2: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల, స్టేషనరీని అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ కమిటీ ఎన్నిక

సుభాష్‌నగర్, జూలై 2: తెలంగాణ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సరిత, ప్రధాన కార్యదర్శిగా జి.కవిత, కోశాధికారిగా ప్రమోద్, ఉపాధ్యక్షుడిగా రాజేశ్, జాయింట్ సెక్రెటరీగా బ్లాండీవ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కల్పన, ఈసీ మెంబర్లుగా జన్నిస్టెల్లా, వంశీలను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియమ్మ, జాయింట్ సెక్రెటరీ లక్ష్మన్ రుదవత్, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్స్ విజయలక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

రావూస్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

కరీంనగర్ టౌన్, జూలై 2: నగరంలోని రావూస్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కరీంనగర్ హెడ్ పోస్టాఫీసును సందర్శించారు. మంగళవారం పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈవో నితిన్ రావు, ప్రిన్సిపాల్ రహమాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పోస్టాఫీసు నిర్వహణ, ఉత్తరాల బట్వాడా తదితర అంశాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిమ హాస్పిటల్‌లో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అమిత్‌రావును కలిసి పోషకాహార లోపంతో పిల్లలకు ఎలాంటి అనారోగ్యం వస్తుందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోషకాహారం, వ్యాయం, ఆరోగ్య పరీక్షలపై విద్యార్థులకు ఆయన వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట, జూలై 2: జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామం నుంచి పట్టణంలోని గణేష్ నగర్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మంగళవారం పోలీస్‌లు పట్టుకున్నారు. యాజమాని యాదగిరి, డ్రైవర్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

వైఎస్ షర్మిలను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

హుజూరాబాద్/జమ్మికుంట, జూలై 2: హుజూరాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను హైద్రాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్, ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

సైదాపూర్ ఎంఈవోగా శ్రీనివాస్‌రెడ్డి

సైదాపూర్, జూలై 2: మండలంలోని దుద్దెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న కొమ్మిరి శ్రీనివాస్‌రెడ్డిని సైదాపూర్ మండల ఎంఈవోగా నియమిస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం శ్రీనివాస్‌రెడ్డి సైదాపూర్ విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. నూతన విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డికి పలువురు ఉపాధ్యాయులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

శంకరపట్నం ఎంఈవోగా మధుసూదనాచారి

శంకరపట్నం, జూలై 2: శంకరపట్నం మండల విద్యాధికారిగా మధుసూదనాచారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మధుసూదనాచారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బస్సును పునరుద్ధరించాలని మంత్రికి వినతి

రామడుగు, జూలై2: రామడుగు మండలంలోని వివిధ గ్రామాల మీదుగా వెళ్లే బస్సును పునరుద్ధరించాలని ఎంపీపీ జవాజ్ హరీష్ సర్పంచ్‌ల సంఘం గౌరవ అధ్యక్షుడు ఉప్పుల అంజని ప్రసాద్‌లు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న బస్సును నిలిపివేయడంతో విద్యార్థులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఆందజేత

వీణవంక, జూలై 2: చదువు వల్లే సమాజాంలో మార్పు వస్తుందని బావించిన యుప్ టీవి సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి వీణవంక మండల కేంద్రంలో ఆనాధ, నిరుపేద విద్యార్థులకు తన సొంత డబ్బులతో సిబ్బంది ద్వారా మంగళవారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ప్రతి నెల వెయ్యి చొప్పున 220మంది విద్యార్థులకు రెండు నెలల స్కాలర్‌షిప్‌లు రూ.4.40లక్షలు ఆందజేశారు.